సాక్షి
సంగారెడ్డి
శుక్రవారం, 15, నవంబర్, 2024

న్యూస్‌రీల్

రేపు ధ్రువపత్రాల పరిశీలన

సంగారెడ్డి ఎడ్యుకేషన్‌: జిల్లాలోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న సీఆర్‌టీ, పీజీసీఆర్‌టీ, పీఈటీ పోస్టులకు సంబంధించిన 1:3 మెరిట్‌ లిస్ట్‌ అభ్యర్థుల వివరాలు www.ranfareddy.teanfana.gov.in అనే వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని డీఈఓ వెంకటేశ్వర్లు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వెబ్‌సైట్‌లో ఉన్న అభ్యర్థులు ఈ నెల 16న సంగారెడ్డిలోని జిల్లా కలెక్టరేట్‌లోని సమగ్రశిక్ష కార్యాలయంలో ఉదయం 10 గంటలకు నిర్వహించే ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కావాలని సూచించారు.

నేడు రెడ్డి ల్యాబ్స్‌లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

జహీరాబాద్‌ టౌన్‌: పట్టణంలోని ఆచార్య డిగ్రీ కళాశాలలో శుక్రవారం డాక్టర్‌ రెడ్డి ల్యాబ్స్‌లో ఉద్యోగాలకు నిర్వాహకులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్‌ డాక్టర్‌ హరికుమార్‌ గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు. 2023–24 సంవత్సరంలో బీఎస్సీ డిగ్రీ పాసైన మహిళా అభ్యర్థులకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. బీఎస్సీ బీజెడ్‌సీ, ఎంపీసీలో కెమిస్ట్రీ ఒక సబ్జెక్ట్‌గా కలిగి 60% మార్కులతో ఉత్తీర్ణులైన వారు ఈ ఉద్యోగాలకు అర్హులని వెల్లడించారు. అభ్యర్థులు ఎస్‌ఎస్‌సీ, ఇంటర్‌, డిగ్రీ సర్టిఫికెట్లు, ఆధార్‌, రెజ్యూమెతో ఉదయం 9 గంటలకు హాజరుకావాలని ఆయన కోరారు.

నియోజకవర్గానికో సమీకృత గురుకులం

ఎమ్మెల్యే డాక్టర్‌ సంజీవరెడ్డి వెల్లడి



గిరిజన బాలికల వసతిగృహంలో కేక్‌కట్‌ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్‌ సంజీవరెడ్డి

నారాయణఖేడ్‌: విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని, పేద విద్యార్థులకోసం నియోజకవర్గానికో సమీకృత గురుకుల పాఠశాలలను నిర్మిస్తోందని ఎమ్మెల్యే డాక్టర్‌ సంజీవరెడ్డి పేర్కొన్నారు. దివంగత మాజీ ప్రధాని జవహర్‌లాల్‌ నెహ్రూ జయంతి సందర్భంగా బాలలదినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఖేడ్‌లోని గిరిజన బాలికల వసతిగృహంలో విద్యార్థినులతో కలసి ఆయన కేకును కట్‌ చేశారు. ఈ సందర్భంగా సంజీవరెడ్డి మాట్లాడుతూ...గత ప్రభుత్వం విద్యావ్యవస్థను భ్రష్టు పట్టించిందని ఆరోపించారు. తమ ప్రభుత్వం విద్యకు ప్రథమ ప్రాధాన్యతనిస్తూ 40% డైట్‌, కాస్మెటిక్‌ చార్జీలను పెంచిందన్నారు. విద్యారంగంలో జిల్లాలో నారాయణఖేడ్‌ను ఉన్నతస్థానంలో నిలిపేందుకు తన శక్తివంచనలేకుండా కృషి చేస్తానని తెలిపారు. మున్సిపల్‌ చైర్మన్‌ ఆనంద్‌ స్వరూప్‌ షెట్కార్‌, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, బంజారా సేవాలాల్‌ సంఘం అధ్యక్షుడు రమేశ్‌ చౌహాన్‌, బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు భోజిరెడ్డి, నెహ్రూనాయక్‌ పాల్గొన్నారు.

గ్లాండ్‌ ఫార్మా ఆధ్వర్యంలో విద్యార్థులకు అల్పాహారం

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం నల్తూరు గ్రామంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉదయం అల్పాహారాన్ని అందించేందుకు గ్లాండ్‌ ఫార్మా పరిశ్రమ యాజమాన్యం ముందుకొచ్చింది. గురువారం నుంచి విద్యార్థులకు అల్పాహారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రాములు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులకు గ్లాండ్‌ ఫార్మా పరిశ్రమ యాజమాన్యం ఉదయం అల్పాహారం అందజేయడం ప్రశంసనీయమన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులు ఉదయం భోజనం చేయకుండా వస్తున్నారని గ్లాండ్‌ ఫార్మా పరిశ్రమ యాజమాన్యానికి సమస్య వివరించగా అల్పాహారాన్ని ఏర్పాటు చేస్తామని ముందుకు వచ్చారని అన్నారు. గతంలో పటాన్‌చెరు మాజీ జెడ్పీటీసీ ఎం.జైపాల్‌ విద్యార్థులకు టై, బ్యాచ్‌, బెల్ట్‌, ప్లేట్లు వంటి సామగ్రి అందజేశారన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో శేషు కుమార్‌, మహమ్మద్‌ అబ్దుల్లా, ఎండి రఫీ, హేమలత, దయాకర్‌, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు డయల్‌ యువర్‌ డీఎం

నారాయణఖేడ్‌: ప్రయాణికుల సమస్యలపై శుక్రవారం ఉదయం 10గంటల నుంచి 11గంటల వరకు నారాయణఖేడ్‌ డిపోలో డయల్‌ యువర్‌ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్‌ మల్లేశయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు, ప్రజలు ఆర్టీసీకి సంబంధించిన సమస్యలు, మరింత మెరుగైన సేవలకుగాను 99592 23170 నంబరుకు ఫోన్‌చేసి వివరించి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నైరాశ్యపు మోముల్లో.. నమ్మకపు నవ్వులు



సంగారెడ్డిలో సహారా ప్రాథమిక పునరావాస కేంద్రంలోని చిన్నారులతో కలెక్టర్‌

ఎదుగుదల లోపించిన చిన్నారులతో కలెక్టర్‌ క్రాంతి

- వారి తల్లులతోనూ మాట్లాడి భరోసా
- విజేతలకు బహుమతులు అందజేత
- 'సాక్షి', సహారా సొసైటీల ఆధ్వర్యంలో ఘనంగా బాలల దినోత్సవం



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ఎదుగుదల లోపించిన చిన్నారులకు సరైన సమయంలో, సరైన చికిత్సలను అందిస్తే సాధారణ పిల్లలకు దీటుగా నడుచుకుంటారని కలెక్టర్‌ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. ఇలాంటి చిన్నారుల చికిత్స కోసం ప్రభుత్వ తరఫున అందాల్సిన అన్ని సహాయ సహకారాలను అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు. 'సాక్షి' మీడియా గ్రూప్‌, సహారా సొసైటీల ఆధ్వర్యంలో గురువారం బాలల దినోత్సవాన్ని సంగారెడ్డిలో సహారా ప్రాథమిక పునరావాస కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్‌ ముఖ్యఅతిథిగా హాజరై చిన్నారులతో ఉల్లాసంగా గడిపారు. మానసికంగా, శారీరకంగా ఎదుగుదల లోపాలు ఉన్న చిన్నారులతో మమేకమయ్యారు. వారి తల్లులతో మాట్లాడారు. చిన్నారుల ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకుని భరోసా కల్పించారు. తమ చిన్నారులకు ఉన్న సమస్యలను వారి తల్లులు ఈ సందర్భంగా కలెక్టర్‌కు వివరించారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వివిధ రకాల ఆటల పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు కలెక్టర్‌ బహుమతులను అందజేశారు. అలాగే కలెక్టర్‌ స్వయంగా బహుమతులను తీసుకువచ్చి చిన్నారులందరికీ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ.. దివ్యాంగులకు సేవ చేయడం ఉత్తమమని అన్నారు. విద్యావంతులైన ప్రత్యేక సిబ్బందితో విద్యా, ఆరోగ్యం జీవన నైపుణ్యాలు అందించడం ద్వారా వారి భవిష్యత్‌కు బలమైన పునాది వేస్తున్న సహారా సెంటర్‌ను అభినందించారు.

ఎలక్ట్రిక్‌ ఆటో మంజూరు చేయిస్తా

చికిత్స కోసం పునరావాస కేంద్రానికి వచ్చే వారికి రవాణా సౌకర్యం కల్పించాలని చిన్నారుల తల్లులు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఓ ఎలక్ట్రిక్‌ ఆటోను మంజూరు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్‌ తెలిపారు. జిల్లా పరిశ్రమల శాఖ అధికారులతో మాట్లాడి ఈ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వినికిడి సమస్య ఉన్న చిన్నారులకు ప్రభుత్వం తరఫున వినికిడి (హియరింగ్‌) పరికరాలు అందజేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సదరం సర్టిఫికేట్లు మంజూరు చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సహారా సొసైటీ వ్యవస్థాపకుడు మఠంశంకర్‌, సీఈఓ ప్రతిమారెడ్డి, సంగారెడ్డి తహసీల్దార్‌ దేవదాస్‌, 'సాక్షి'బృందం పి.బాలప్రసాద్‌, శివప్రసాద్‌, నవీన్‌, బాలయ్య, ప్రశాంత్‌ తదితరులు పాల్గొన్నారు.

మరింత ధైర్యాన్ని నింపారు



బాలల దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్‌ మాట్లాడి మాలో కొండంత ధైర్యం నింపారు. మా కొడుకు నడవడానికి ఇబ్బంది పడేవాడు. చికిత్స కోసం ఈ కేంద్రానికి తీసుకువస్తున్నాం. ఇప్పుడు నడవగలుగుతున్నాడు. మా సమస్యను కలెక్టర్‌ అడిగి తెలుసుకున్నారు.

– రోజా, సంగారెడ్డి, చిన్నారి తల్లి

అందరితో జరుపుకోవడం బాగుంది



ఈరోజు నా పిల్లలు ఎంతో సంతోషంగా గడిపారు. నా పిల్లలిద్దరూ మెదడు ఎదుగుదలకు సంబంధించిన సమస్యతో బాధపడుతున్నారు. ఈ సమస్య ఉందని కరోనా సమయంలోనే తెలిసింది. అందరిమధ్య ఇలా బాలల దినోత్సవం జరుపుకోవడం సంతోషంగా ఉంది.

– నజీర, చిన్నారుల తల్లి, పొత్తిరెడ్డిపల్లి

సంతోషంగా ఉంది



సాక్షి మీడియా గ్రూప్‌, సహారా సొసైటీల ఆధ్వర్యంలో నిర్వహించిన బాలల దినోత్సవానికి జిల్లా కలెక్టర్‌ హాజరై చిన్నారులతో మమేకమయ్యారు. చాలా సంతోషంగా ఉంది. చిన్నారుల్లో ఎదుగుదల లోపాన్ని సకాలంలో గుర్తించి సరైన చికిత్స అందిస్తే శాశ్వత వైకల్యం కాకుండా నివారించవచ్చు. లేని పక్షంలో ఆయా చిన్నారులు శాశ్వత వైకల్యంతో బాధపడాల్సి ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లోని ఇలాంటి చిన్నారులకు సహారా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మానసిక, శారీరక ఎదుగుదల కోసం ఫిజియోథెరపీ, స్పీచ్‌ థెరపీ వంటి చికిత్సలు అందించి వారిని సాధారణ పిల్లల్లా చేస్తున్నాం.

– మఠం శంకర్‌, సహారా సొసైటీ వ్యవస్థాపకుడు, సంగారెడ్డి





సాక్షి మీడియా, సహారా ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలల దినోత్సవంలో చిన్నారులతో ముచ్చటించిన కలెక్టర్‌ క్రాంతి



పునరావాస కేంద్రంలో ఆడుకుంటున్న చిన్నారులు



కలెక్టర్‌తో సాక్షి ప్రతినిధులు, సహారా ఫౌండేషన్‌ నిర్వాహకులు

ప్రతీ గింజను కొనుగోలు చేయాలి

జిల్లా కలెక్టర్‌ వల్లూరు క్రాంతి

సంగారెడ్డిజోన్‌/సంగారెడ్డిటౌన్‌ : వాతావరణ శాఖ వర్ష సూచన నేపథ్యంలో రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద తీసుకువచ్చిన ధాన్యం తడవకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. ధాన్యాన్ని కుప్పలుగా మార్చి వాటిని కవర్లతో కప్పి రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. సంగారెడ్డి మండలం ఇస్మాయిల్‌ ఖాన్‌పేటలో గురువారం కలెక్టర్‌ సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే వివరాల నమోదును, ధాన్యం సేకరణ కేంద్రాన్ని పరిశీలించారు. వర్షాలకు ధాన్యం తడిసిపోకుండా, పంట నష్టానికి గురికాకుండా ఉండేందుకు వీలైనన్ని టార్పాలిన్‌ కవర్లు వినియోగించాలని సూచించారు. వర్షం పడే సమయంలో రైతులు ధాన్యం రాశుల వద్ద ఎక్కువసేపు ఉండకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు.

ధాన్యం సేకరణ కేంద్రాల పరిశీలన

రైతుల నుంచి ప్రతీ ధాన్యం గింజను కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్‌ వల్లూరు క్రాంతి ఆదేశించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ, రైతులకు అందిస్తున్న సదుపాయాలు, ధాన్యం విక్రయ కేంద్రాల్లో రైతుల సమస్యలు తెలుసుకుని, వాటికి తగిన పరిష్కారాలు చూపేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి రైతులకు సకాలంలో చెల్లింపులు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం తేమశాతాన్ని పరిశీలించారు. దళారులను ఆశ్రయించి తక్కువ ధరకు విక్రయాలు చేయవద్దని, ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న సమగ్ర కుటుంబ సర్వే రికార్డులను పరిశీలించారు. సర్వే ఫామ్‌లను తప్పులేకుండా నమోదు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ దేవదాస్‌, ఎంపీడీఓ సురేందర్‌ రెడ్డి, ఏఈఓలు, సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సైన్స్‌ ఎగ్జిబిషన్‌

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

ప్రశాంత్‌నగర్‌(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల ఇందిరానగర్‌లో రెండు రోజుల పాటుగా నిర్వహించిన సైన్స్‌ ఎగ్జిబిషన్‌ గురువారం ముగిసింది. ఈ ఎగ్జిబిషన్‌లో జీవ, భౌతిక, రసాయనశాస్త్రాలకు సంబంధించిన 120 ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఉస్మానియా యూనివర్సిటీ జువాలజీ హెచ్‌వోడీ డాక్టర్‌ మాధవి, చీఫ్‌ సైంటిస్ట్‌ డాక్టర్‌ శ్రీహరి, ప్రిన్సిపల్‌ సైంటిస్ట్‌ డాక్టర్‌ సూర్య ప్రకాశ్‌ సింగ్‌, సైన్స్‌ అండ్‌ టెక్నాలజీ సిరి ఆర్గనైజేషన్‌ చైర్మన్‌ శ్రీనివాస్‌, మండల విద్యాధికారి ప్రభాకర్‌రెడ్డిలు ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తి పెరుగుతోందన్నారు.

రూ.4 కోట్లతో మోడల్‌ గెస్ట్‌హౌస్‌

- జహీరాబాద్‌–బీదర్‌ రోడ్డు అప్‌గ్రేడ్‌
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి

జహీరాబాద్‌ టౌన్‌: పట్టణంలోని పాత అతిథి గృహం స్థానంలో రూ.3 నుంచి 4 కోట్ల వ్యయంతో మోడల్‌ గెస్ట్‌ హౌస్‌ను నిర్మించడంతోపాటుగా త్వరలోనే జహీరాబాద్‌–బీదర్‌ రోడ్డును అప్‌గ్రేడ్‌ చేస్తామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెల్లడించారు. జహీరాబాద్‌–బీదర్‌ రహదారిని మొదటి ప్రాధాన్యతలో నాలుగులేన్ల రోడ్డుగా మార్చుతామని ఇందుకు సంబంధించిన ఫైల్‌ కేంద్రమంత్రి నితిన్‌ గడ్కరీ వద్ద ఉందని కోమటిరెడ్డి తెలిపారు. మహారాష్ట్రకు వెళ్లుతున్న సందర్భంగా గురువారం పట్టణంలో మీడియాతో మాట్లాడుతూ...జాతీయ రహదారి 65 పై జహీరాబాద్‌ మీదుగా వెళ్తుందని, షిర్డీ తదితర పుణ్యక్షేత్రాలకు రోడ్డు మార్గంలో వెళ్లే మంత్రులు, వీఐపీలు విశ్రాంతి తీసుకొనేందుకు పట్టణంలో మోడల్‌ గెస్ట్‌ హౌస్‌ను నిర్మిస్తామన్నారు. రోడ్డు ముందుభాగంలో దుకాణాల సముదాయం నిర్మిస్తామని చెప్పారు. ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడి డిజైన్‌ తయారుచేసి త్వరలో పనులు ప్రారంభించాలని ఈ సందర్భంగా మంత్రి ఆదేశించారు. జహీరాబాద్‌ నియోజకవర్గంలోని రోడ్లను బీటీ రోడ్లుగా మార్చేందుకు తన వంతు కృషి చేస్తానని హామీనిచ్చారు. నారాయణఖేడ్‌ నియోజకవర్గంలోని రోడ్లకు కూడా ప్రాధాన్యత ఇస్తామన్నారు. విడతల వారీగా నాలుగేళ్ల కాలంలో రోడ్లకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేస్తామని తెలిపారు. చిరాగ్‌పల్లి నుంచి మన్నాపూర్‌ రోడ్డుకు రూ.15 కోట్లు, జహీరాబాద్‌ నుంచి ఎల్గోయి రోడ్డుకు రూ.32 కోట్లు, ఆసద్‌గంజ్‌ రోడ్డుకు రూ.23 కోట్లు మంజూరైనట్లు వివరించారు. ఈ నిధులతో బీటీ పనులు త్వరలో ప్రారంభమవుతాయని చెప్పారు. జహీరాబాద్‌ నియోజకవర్గంలో విద్యాప్రమాణాలు పెంచడానికి గురుకుల పాఠశాలలను నెలకొల్పుతున్నామని చెప్పారు.

కార్తీక పౌర్ణమికి కేతకీ ముస్తాబు



దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీ కేతకీ సంగమేశ్వర ఆలయం కార్తీకపౌర్ణమి పూజలకు సిద్ధమైంది. తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు రానున్నారు. నేడు శివపార్వతుల కల్యాణం నిర్వహించనున్న నేపథ్యంలో ఆలయనిర్వాహకులు అందుకు తగిన ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాన్ని పచ్చటి తోరణాలు, విద్యుత్‌ వెలుగులతో అందంగా అలంకరించారు.

ఝరాసంగం (జహీరాబాద్‌)

అర్ధరాత్రి సంకెళ్లు ఏమిటీ..?

ఎంపీ రఘునందన్‌రావు



మాట్లాడుతున్న రఘునందన్‌ రావు

సంగారెడ్డి జోన్‌: పాత ముఖ్యమంత్రి కేసీఆర్‌ చేసిన తప్పులే ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేస్తున్నారన్నారని మెదక్‌ ఎంపీ రఘునందన్‌రావు విమర్శించారు. గురువారం సంగారెడ్డి జిల్లా కంది ఐఐటీ హైదరాబాద్‌ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడారు. గతంలో మల్లన్న సాగర్‌ ప్రాజెక్టు పేరిట అర్ధరాత్రి సమయంలో రైతులకు సంకెళ్లు వేసి అరెస్టులు చేశారో ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే వైఖరి అవలంబిస్తోందని చెప్పారు. ముఖ్యమంత్రి మారిండు, ప్రభుత్వం మారింది.. కానీ ప్రజాపాలన వస్తుందని ఆశించిన ప్రజలకు చివరకు మళ్లీ అదే అర్ధరాత్రి రైతుల సంకెళ్లు తప్ప ఏమి మిగలలేదన్నారు. ప్రభుత్వాలు మారినా రైతుల బతుకుల్లో మార్పు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఖమ్మం మిర్చి యార్డులో రైతులకు సంకెళ్లు వేసినప్పుడు.. మల్లన్న సాగర్‌లో అర్ధరాత్రి ఊర్లను ఖాళీ చేస్తుంటే నిరాహార దీక్ష చేసిన రేవంత్‌ రెడ్డి.. ముఖ్యమంత్రి అయిన తర్వాత లగిచర్ల సంఘటన అనంతరం రాత్రిపూట అరెస్టులు ఎందుకు చేస్తున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్‌ చేశారు. ప్రజాపాలన అంటే ప్రజల కోసం పని చేయాలన్నారు. రాష్ట్రంలో పాలన పడకేసి ప్రజల అవస్థలు పడుతుంటే వడ్ల కొనుగోలు జరగకుండా, లారీలు రాకుండా ఇబ్బందులు పడుతుంటే ఒకరు ముంబై.. మరొకరు ఢిల్లీకి వెళ్లి ఆరోపణలు చేస్తున్న ఇద్దరూ చర్లపల్లి జైలులో ఉండాల్సిన వారేనని ఎద్దేవా చేశారు. ఫార్మాసిటీ కట్టాలనే ఆలోచన ఉంటే గత ప్రభుత్వం ఫార్మా పేరిట సేకరించి, అభివృద్ధి చేసిన భూమి ఫార్మా కంపెనీలకు ఎందుకు ఇవ్వటం లేదని ప్రశ్నించారు.

విద్యతోపాటు క్రీడలూ ముఖ్యమే

- గెలుపు ఓటముల్ని ఒకేలా తీసుకోవాలి
- మంత్రి దామోదర రాజనర్సింహ
- ముగిసిన జోన్‌ లెవల్‌ స్పోర్ట్స్‌మీట్‌



జోనల్‌ క్రీడల్లో ఫైనల్లో తలపడిన జట్లతో మంత్రి దామోదర

జోగిపేట(అందోల్‌): విద్యార్థులు చదువుతోపాటు క్రీడలకూ ప్రాధాన్యతనివ్వాలని, క్రీడల్లో పాల్గొనే విద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటారని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. క్రీడల్లో పాల్గొంటే ఒత్తిడిని తట్టుకునే శక్తిని, నాయకత్వ లక్షణాలను సంపాదించుకుంటారని తెలిపారు. జీవితంలో ఎదగటానికి క్రీడలు ఎంతగానో ఉపయోగపడుతాయని మంత్రి చెప్పారు. అందోల్‌లోని ప్రభుత్వ గురుకుల పాఠశాల, బాలికల జూనియర్‌ కళాశాలలో జరిగిన పదవ జోనల్‌ లెవల్‌ గేమ్స్‌ అండ్‌ స్పోర్ట్స్‌ మీట్‌ బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి గురువారం మంత్రి దామోదర హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్‌ సద్గుణ మేరీ గ్రేస్‌ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...నేటి పిల్లలు, విద్యార్థులే దేశ భవిష్యత్‌ నిర్మాతలన్నారు. ఆటల్లోనైనా జీవితంలోనైనా గెలుపోటములు సహజమని, జయాన్ని, అపజయాన్ని ఒకేలా తీసుకుని ముందుకెళ్లాలన్నారు. అమ్మాయిలు చదువుల్లో, ఆటల్లో రాణించడంతోపాటు సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, ఆర్థిక, సమకాలీన అంశాలపై అవగాహన కలిగి ఉండాలని వివరించారు. స్కూళ్లలో లైబ్రరీలు ఏర్పాటు చేస్తామని విద్యార్థులకు హామీనిచ్చారు.

క్రీడాకారులకు బహుమతుల ప్రదానం

నాలుగు రోజులపాటు జరిగిన పదవ జోనల్‌ లెవల్‌ గేమ్స్‌ అండ్‌ స్పోర్ట్స్‌లో భాగంగా క్రీడా పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు మంత్రి దామోదర రాజనర్సింహ బహుమతులను ప్రదానం చేశారు. ఇస్నాపూర్‌, వికారాబాద్‌ల మధ్య జరిగిన కబడ్డీ ఫైనల్‌ పోటీలను మంత్రి స్వయంగా వీక్షించారు. ఈ పోటీల్లో వికారాబాద్‌ జట్టు గెలుపొందింది. వ్యక్తిగత అథ్లెటిక్స్‌ చాంపియన్‌షిప్‌లో అండర్‌ 14లో ఇస్నాపూర్‌కు చెందిన సింధూ, అండర్‌ 17లో వికారాబాద్‌కు చెందిన కీర్తన పతకాలు సాధించారు. ఓవరాల్‌ ఛాంపియన్‌షిప్‌ ఇన్‌ అథ్లెటిక్స్‌ అండర్‌ 14 వికారాబాద్‌ 34 పాయింట్స్‌, అండర్‌ 17 , జహీరాబాద్‌ 42 పాయింట్స్‌ను సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌ చంద్రశేఖర్‌, ఆర్డీఓ పాండు, రీజినల్‌ అధికారి భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

సర్వేను బహిష్కరించిన గౌరవెల్లి నిర్వాసితులు

పూర్తి పరిహారం రాలేదంటూ నిరసన

అక్కన్నపేట(హుస్నాబాద్‌): తమకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం రాలేదంటూ గౌరవెల్లి ప్రాజెక్టు నిర్వాసితులు కులగణన సర్వేను బహిష్కరించి నిరసన తెలిపారు. అక్కన్నపేట మండలం కపూర్‌నాయక్‌తండా గ్రామ పరిధిలో దాదాపు 60 కుటుంబాల భూ నిర్వాసితులు ఇళ్లు నిర్మించుకుని 'శ్రీరామ్‌తండా'అనే పేరుతో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో గురువారం కులగణన సర్వే చేసేందుకు ఎన్యుమరేటర్లు తండాకు వెళ్లారు. సర్వేలో తాము పాల్గొనేదిలేదంటూ బహిష్కరించి, ఎన్యుమరేటర్లను వెనక్కి పంపించారు. ఈ సందర్భంగా పలువురు భూ నిర్వాసితులు మాట్లాడుతూ ఇప్పటికీ ఇళ్ల స్థలాలకు, భూములకు సంబంధించి పరిహారం రావల్సి ఉందన్నారు. పరిహారం చెల్లిస్తామని చెబుతున్నారే తప్ప మాకు చెల్లించలేదన్నారు. పెండింగ్‌లో ఉన్న పరిహారం పూర్తిస్థాయిలో చెల్లించేవరకు సర్వేలో పాల్గొనబోమని స్పష్టం చేశారు.

క్లుప్తంగా

సీఐ రంగాకృష్ణకు రివార్డు

పలు గంజాయి కేసులు ఛేదన



సీఐకి రివార్డు అందజేస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

తూప్రాన్: తూప్రాన్ ఉమ్మడి మండలంలో గంజాయి కేసులు ఛేదించిన సీఐ రంగాకృష్ణకు ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి గురువారం తన కార్యాలయంలో రివార్డు అందజేశారు. విధి నిర్వహణలో పోలీసు ఉద్యోగం బాధ్యతతో కూడుకుందన్నారు. ప్రజలకు ప్రయోజనం చేకూరే పనులు చేస్తే వారి గుండెల్లో నిలిచి పోతామన్నారు. ప్రతీ ఉద్యోగి బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. మత్తు పదార్థాల నిర్మూలన విషయంలో ప్రభుత్వం కఠినంగా ఉందన్నారు. గంజాయి, డ్రగ్స్ నివారణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అలాగే ఎస్పీ కార్యాలయంలో మనోహరాబాద్ ఎస్‌ఐ సుభాష్‌గౌడ్, ఐడీ పార్టీ సిబ్బందికి రివార్డులు అందజేశారు.

వీధి కుక్కల దాడిలో ఐదుగురికి గాయాలు



గాయపడిన వృద్ధురాలు నీలవ్వ

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణంలో వివిధ ప్రాంతాల్లో గురువారం వీధి కుక్కల దాడిలో ఐదుగురు గాయపడ్డారు. టీచర్స్ కాలనీలో బొల్లి నీలవ్వ, సింగాపురం పోచమ్మలు ఇంటి వద్ద కూర్చోగా ఆకస్మాత్తుగా కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. వీరిని చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. అలాగే ఆర్మూర్‌కు చెందిన లక్ష్మి, వేములవాడకు చెందిన పుష్ప బంధువుల ఇంటికి రాగా సుభాష్ నగర్, మల్లెచెట్టు చౌరస్తాలో ఇద్దరిపై కుక్కలు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. అలాగే రాజు అనే వ్యక్తి పై దాడి చేయగా గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. మున్సిపల్ అధికారులు వీధి కుక్కల నివారణకు తగు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

హైనా దాడిలో జీవాలు మృత్యువాత



మద్దూరు(హుస్నాబాద్): హైనా దాడిలో జీవాలు మృత్యువాత పడిన ఘటన మండలంలోని రేబర్తి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఒగ్గు కొమురయ్య గొర్రెల పెంపకం పై ఆధారపడి జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటిలాగే రాత్రి పాకలోకి గొర్రెలను పంపించి ఇంటికెళ్లాడు. గురువారం తెల్లవారుజామున గొర్రెల వద్దకు వెళ్లి చూడగా హైనా దాడిలో 17 జీవాలు మృతి చెంది ఉన్నాయి. ఈ ఘటనలో కొమురయ్యకు సుమారు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లింది. ఘటనా స్థలాన్ని పశుసంవర్థక శాఖ, అటవీ శాఖ అధికారులు సందర్శించి పంచనామా నిర్వహించారు. ఆర్థికంగా నష్టపోయిన కొమురయ్యను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

దుబ్బాకటౌన్: గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. దుబ్బాక ఎస్సై గంగరాజు కథనం మేరకు.. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన గంట నక్క లచ్చయ్య(23) గంగిరెద్దులను ఆడిస్తూ భిక్షాటన చేస్తూ జీవనం గడిపేవాడు. ఇంటి వద్ద తరుచూ మద్యం తాగుతూ భార్య, కుటుంబ సభ్యులతో గొడవలు పెట్టుకునేవాడు. 4వ తేదీన బతుకుదెరువుకు దుబ్బాక పట్టణానికి వచ్చి మల్లయ్యపల్లి దారిలో గుడిసెలు వేసుకొని ఉన్నారు. అదే రోజు కల్లులో గడ్డి మందు కలుపుకొని తాగి ఇంటికొచ్చి వాంతులు చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు సిరిసిల్ల ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. గురువారం మృతుడి పెద్ద నాన్న కర్రె ఎల్లయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చక్కని ఇంట.. మిద్దె పంట

- డాబాపై కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల మొక్కల సాగు
- జాలీ షెడ్డు, కుండీలు, తొట్లు, మట్టి బస్తాలు ఏర్పాటు
- ఇంట్లో వంటకు ఇవే కూరగాయలు
- రూ.3.50 లక్షల వరకు ఖర్చు
- ఆదర్శంగా కౌడిపల్లికి చెందిన మట్టి నీరజా రెడ్డి



వంటకు ఇంటి పంటే

ఇంటి పంట ద్వారా ప్రతి రోజూ ఇంట్లో ఉన్న నలుగురికి కూరగాయలు, ఆకుకూరలు వంటకు వాడుతున్నారు. మూడేళ్లుగా ఇంటి పంటనే తింటున్నారు. మార్కెట్‌లో కూరగాయలు కొనడం బంద్ చేసినట్లు చెప్పారు.

కౌడిపల్లి(నర్సాపూర్): భార్యకు ఇష్టమైంది.. భర్త సహకరించాడు. దీంతో ఇంటి డాబాపై కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తూ.. కల్తీ లేని స్వచ్ఛమైన కూరగాయలు తింటూ ఆరోగ్యానికి బాటలు వేసుకున్నారు. దీని కోసం జాలీ షెడ్డు, కుండీలు, తొట్లు, మట్టి బస్తాలు ఇతర ఏర్పాట్లు చేశారు. సుమారుగా రూ 3.50 లక్షలకుపైగా ఖర్చు చేశారు. మూడేళ్లుగా ప్రతి రోజూ ఇంటి పంటే తింటూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు కౌడిపల్లికి చెందిన మట్టి నీరజ బుచ్చిరెడ్డి దంపతులు.

కౌడిపల్లికి చెందిన మట్టి నీరజ గృహిణి. భర్త బుచ్చిరెడ్డి కంచన్‌పల్లి హెచ్ఎంగా విధులు నిర్వహిస్తున్నాడు. కాగా ఇంటి డాబాపైన కూరగాయలు పెంచుతున్నారు. ఇద్దరిదీ వ్యవసాయ అనుబంధ కుటుంబం కావడం, చదువు చెప్పే మాస్టార్ కావడంతో రసాయనాల కల్తీ లేని కూరగాయలు తినాలన్న ఆలోచనతో ఖర్చుకు వెనుకాడ లేదు. దీంతో డాబాపై రూ.3.50లక్షలకు పైగా ఖర్చుచేసి ఇంటి మిద్దెపై కూరగాయలు, పండ్లు సాగు చేస్తున్నారు.

పండ్ల మొక్కల రకం

తాయివాన్ జామ, మామిడి, బొప్పాయి. సపోట, డ్రాగెన్ ఫ్రూట్, అంజూర, ఫ్యాషన్ ఫ్రూట్, స్టార్ ఫ్రూట్, నిమ్మ, స్వీట్ నిమ్మ, దానిమ్మ, చెర్రి, ఆపిల్ బేర్, అరటి మొక్కలు నాటారు. ఇవి కాతకాస్తున్నాయి.

కూరగాయలు, ఆకుకూరలు

కూరగాయలు టమాట, చిట్టి టమాట, వంకాయ, బెండ, సొరకాయ, తోటకూర, పాలకూర, చుక్కకూర, పుదీనాతోపాటు తీగజాత మొక్కలు బీరకాయ, కాకరకాయ, చిట్టి కాకరకాయ, దొండ సాగు చేస్తున్నారు.

ఇవి ప్రత్యేకం

స్వీట్ చింత, పుసుపు, అల్లం, మిరియాలు, మిర్చి, మునగ వేశారు.

30 కిలోల పసుపు దిగుబడి

గతేడాది రెండు కిలోల పసుపు విత్తనాలు నాటగా 30 కిలోల పసుపు దిగుబడి రావడంతో ఉడికించి ఎండబెట్టి పసుపు తయారు చేశారు. ఇంటి అవసరాలకు వాడుకుంటున్నారు. అల్లం సైతం సాగు చేస్తున్నారు. ఈ ఏడాది 5 కిలోల పసుపు విత్తనాలు నాటారు 50 కిలోలకుపైగా దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు.



కల్తీలేని ఆహారం కోసమే

రసాయనాలు లేని ఆహారం తినాలన్న ఉద్దేశ్యంతో ఇంటి పంటను పండిస్తున్నాం. దీని కోసం భర్త బుచ్చిరెడ్డి సహకారంతో రూ 3.50లక్షలకు పైగా ఖర్చు చేశాం. కోతుల బెద ఎక్కువగా ఉండటంతో జాలిషెడ్డు వేయించాం. పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు ఇలా అన్ని రకాల మొక్కలు అందుబాటులో ఉన్నాయి. ప్రతి రోజూ మొక్కలకు నీళ్లు పెట్టడం, చెత్త కలుపు తీయడం మాపని. ఇటు ఇంటి పంట, అటు వ్యాయామం రెండు అవుతున్నాయి.

– మట్టి నీరజారెడ్డి



డాబాపై జాలీషెడ్డు

గ్రామంలో కోతుల బెడద ఎక్కువగా ఉండటంతో డాబాపైన సుమారు రెండు గుంటల విస్తీర్ణంలో జాలీ షెడ్డును వేశారు. ఇందులో ప్రత్యేకంగా నాలుగు ఫీట్ల ఎత్తు, రెండు ఫీట్ల వెడల్పుతో ఆరు మీటర్ల పొడవుతో తొట్లు నిర్మించారు. దీంతోపాటు నీటి కుండీలు, తొట్లు, ప్లాస్టిక్ బకెట్లు, ఆయిల్, నూనె డబ్బాలు, ప్లాస్టిక్ బస్తాలు ఏర్పాటు చేశారు. ఇందులో ఎర్రమట్టి, పేడ ఎరువు, సేంద్రియ ఎరువు, చెక్కపొడి కలిపి వాటిలో నింపి మొక్కలు నాటారు. ప్రస్తుతం కూరగాయలు, ఆకుకూరలు, పండ్లమొక్కలు, పసుపు, అల్లం ఇతర మొక్కలు ఏపుగా పెరిగాయి.



డాబాపై సాగు చేస్తున్న పసుపు పంట



కుండీల్లో సపోట, ఇతర మొక్కలు



తొట్లు, బస్తాలలో మొక్కలు



నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి మజుందార్, ఎంపీ రఘునందన్ రావు, డైరెక్టర్ తదితరులు

వీక్షిత్ భారత్ 2047లో ఐఐటీ కీలకం

- కేంద్ర సహాయ మంత్రి సుకాంత మజుందార్
- ఏక్ పెడ్ మాకే నామ్‌లో భాగంగా మొక్కలు నాటిన మంత్రి, ఎంపీ

సంగారెడ్డి జోన్: స్వాతంత్రం సిద్ధించి 100 ఏళ్ల నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలని చేపట్టిన వీక్షిత్ భారత్ 2047లో ఐఐటీ హైదరాబాద్ ప్రముఖ సంస్థగా మారుతుందని కేంద్ర విద్యా, ఈశాన్య ప్రాంత అభివృద్ధి సహాయ మంత్రి సుకాంత మజుందార్ అన్నారు. గురువారం కంది మండల పరిధిలోని ఐఐటీ హైదరాబాద్‌ను ఆయన మెదక్ ఎంపీ రఘునందన్ రావు, ఐఐటీ డైరెక్టర్ బీవీఎస్ మూర్తితో కలిసి సందర్శించారు. నూతనంగా నిర్మించిన కల్పన చావ్లా వసతి గృహాన్ని ప్రారంభించారు. అదే విధంగా ఏక్ పెడ్ మాకే నామ్ లో భాగంగా మొక్కలు నాటి నీరు పోశారు. ప్రొఫెసర్లు, విద్యార్థులతో కలిసి రీసర్చ్ సెంటర్లను సందర్శించారు. అనంతరం ఆడిటోరియంలో నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక వనరుల కేంద్రంగా ఉన్న నాలెడ్జ్ రిసోర్స్ సెంటర్(లైబ్రరీ) పరిశోధన, విద్యారంగానికి సహాయ సహకారాలు అందిస్తుందన్నారు.

విద్యార్థులు రాజకీయంగా ఎదగాలి

విద్యార్థులు పరిశోధనలు ఉద్యోగాలతో పాటు రాజకీయంగా ఎదగాలని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఐఐటీ హైదరాబాద్ సాధించిన ప్రగతిని వివరించారు.

పరిశోధనలు అంకితభావంతో ముందడుగు

ఐఐటీ హైదరాబాద్ విద్యారంగంలో పరిశోధనలు చేస్తూ అంకితభావంతో ముందుకు సాగుతుందని ఐఐటీ డైరెక్టర్ బీఎస్ మూర్తి అన్నారు. దేశంలో ప్రఖ్యాత సంస్థగా నిలిచిందని పేర్కొన్నారు. సమగ్ర విద్య, పరిశోధనలతో దేశంలో వినూత్నకు రారాజుగా నిలుస్తుంది అన్నారు. సమావేశంలో నాయకులు, ప్రొఫెసర్లు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూములు ఆక్రమిస్తే సహించం



గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

- ప్రహరీ నిర్మించిన ఓ పరిశ్రమ నిర్వాహకులు
- కర్కపట్ల గ్రామస్తుల ఆందోళన

మర్కూక్(గజ్వేల్): ఆలయ భూమలను ఆక్రమిస్తే సహించబోమని మండలంలోని కర్కపట్ల గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని కర్కపట్ల గ్రామ శివారులోని ఓ పరిశ్రమ వాడలోని మత్తడి మైసమ్మ దేవాలయం భూమిలో ఓ పరిశ్రమకు చెందిన నిర్వాహకులు చుట్టూ ప్రహరీ నిర్మిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు అభ్యంతరం తెలుపుతూ గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న గజ్వేల్ ఏసీపీ పురుషోత్తం, గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ అనురాధ, మేనేజర్ విజయ, మర్కూక్ తహసీల్దార్ ఆరిఫా, ఎస్ఐ దామోదర్ ఘటనా స్థలానికి చేరుకొని గ్రామస్తులు, పరిశ్రమ నిర్వాహకులతో మాట్లాడారు. ఈ సందర్భం కర్కపట్ల గ్రామస్తులు మాట్లాడుతూ.. తమ గ్రామానికి చెందిన పలు సర్వే నంబర్‌లో గల ఆలయ భూమిలో ఓ పరిశ్రమ నిర్వాహకులు గోడను నిర్మిస్తున్నారని, దశాబ్దాలుగా ఆ భూమిలో వేడుకలు జరుపుకుంటున్నామని తెలిపారు. అలా గోడను నిర్మిస్తే గ్రామానికి ఒక ఎకరా భూమిని కేటాయించాలని అక్కడ ఆలయాన్ని నిర్మించి పూజలు చేసుకుంటామని పేర్కొన్నారు. దీనికి నిర్వాహకులు ఒప్పుకోకపోవడంతో అధికారులు ఈ విషయాన్ని టీజీఐఐసీ ఎండీ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు తెలిపారు. త్వరలోనే సమస్య పరిష్కరిస్తామని ఏసీపీ పురుషోత్తం చెప్పడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుగుణాకర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సింగం సత్తయ్య, బీజేపీ నాయకులు గురువారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కనకయ్యగౌడ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

విధులు ముగించుకొని ఇంటికెళ్తుండగా..

- స్కూటీని ఢీకొట్టిన కారు
- తీవ్ర గాయాలతో వ్యక్తి మృతి



నరేశ్ గౌడ్(ఫైల్)

పటాన్‌చెరు టౌన్: స్కూటీని కారు ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకట్ రెడ్డి కథనం మేరకు.. అందోల్ మండలం కోడెకల్ గ్రామానికి చెందిన నరేశ్ గౌడ్(29) బతుకు దెరువు కోసం వచ్చి పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో ఉంటూ బొల్లారం పారిశ్రామికవాడ లోని ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. బుధవారం డ్యూటీకి ముగించుకొని రాత్రి స్కూటీపై ఇస్నాపూర్‌కు వెళ్తున్నాడు. పోచారం గ్రామ శివారులోని ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు అండర్ బ్రిడ్జి సమీపంలోకి రాగానే స్కూటీని వెనుక నుంచి కారు ఢీకొట్టింది. స్కూటీ నడుపుతున్న నరేశ్ గౌడ్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి సోదరుడు వెంకట్ గౌడ్ గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అప్పుల బాధతో ఉరేసుకొని ఆత్మహత్య



సత్యనారాయణ(ఫైల్)

టేక్మాల్(మెదక్): ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన టేక్మాల్ పంచాయతీ పరిధిలోని గొల్లగూడెం గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ రాజేశ్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన కొత్తపల్లి సత్యనారాయణ(36) ఎస్‌హెచ్ఏఐ 1033 అంబులెన్స్ వాహనంలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గురువారం ఉదయం పని నిమిత్తం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో మళ్లీ ఇంటికి వచ్చి ఎవరూ లేని సమయంలో చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పుల బాధతో భర్త సత్యనారాయణ ఆత్మహత్య చేసుకున్నట్లుభార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

కోహెడరూరల్(హుస్నాబాద్): విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని వింజపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ అభిలాష్ కథనం మేరకు.. బీహార్ రాష్ట్రానికి చెందిన దీపక్ కుమార్ (20) గ్రామ శివారులోని మాణిదీప్ పౌల్ట్రీ ఫామ్‌లో కూలీగా పని చేస్తున్నాడు. గురువారం సాయంత్రం పౌల్ట్రీ సమీపంలో గల నివాసంలో కూరగాలయ చెట్ల కోసం నీరు పెట్టేందుకు ఇనుప పైపు తీస్తున్న క్రమంలో కరెంట్ వైర్లు తగిలి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

పిల్లలతో సహా తల్లి అదృశ్యం

సిద్దిపేటకమాన్: ఇద్దరు పిల్లలతో సహా తల్లి అదృశ్యమైన ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ముస్తాబాద్‌కు చెందిన వల్లెపు భాస్కర్, అరుణ పట్టణానికి వలసొచ్చి స్థానికంగా కేసీఆర్ నగర్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి తన్వి (5), శ్రీహాన్ (3) పిల్లలున్నారు. భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండటంతో మనస్థాపానికి గురైన అరుణ బుధవారం పిల్లలతో కలిసి ఇంటి నుంచి వెళ్లిపోయింది. అరుణ తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు 64 మంది ఎంపిక



క్రీడాకారులతో కళాశాల సిబ్బంది



ఉమ్మడి జిల్లా బేస్‌బాల్ జట్టు సభ్యులు

సిద్దిపేటజోన్: నిర్మల్‌లో 16 నుంచి 18 వరకు రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలకు సంబంధించి గురువారం సిద్దిపేటలో ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి మెదక్ జిల్లా అండర్ 14, అండర్17 విభాగాల్లో ఎంపికలు నిర్వహించగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 250 మంది బాలబాలికలు హాజరు కాగా 64 మంది ఎంపికై నట్లు పేర్కొన్నారు. ఈ ప్రక్రియను ఎస్జీఎఫ్ జిల్లా సెక్రటరీ సౌందర్య పర్యవేక్షించారు.

గిరిజన గురుకులం విద్యార్థులు

నర్సాపూర్ : రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు తమ కళాశాలకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారని స్థానిక అల్లూరి సీతారామరాజు గిరిజన గురుకుల కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. సిద్దిపేటలో జరిగిన ఉమ్మడి జిల్లాల బేస్‌బాల్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వివిధ కేటగిరీలలో కళాశాలకు చెందిన 20 మంది క్రీడాకారులు పాల్గొనగా పది మంది ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌తోపాటు పలువురు లెక్చరర్లు అభినందించారు.

జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు..



క్రీడాకారిణి దివ్య

చేగుంట(తూప్రాన్): జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు చేగుంట ఉన్నత పాఠశాల విద్యార్థిని దివ్య ఎంపికై నట్లు పీడీ శారద తెలిపారు. స్కూల్ గేమ్ ఫెడరేషన్ అండర్ 17 బాలికల విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభను కనబర్చి జాతీయ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. దివ్య జాతీయ పోటీలకు ఎంపిక కావడంపై ఎంఈఓ నీరజ పీఈటీల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, కోచ్ గణేశ్ రవికుమార్‌లు హర్షం వ్యక్తం చేశారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం



మంటల్లో లాండ్రీ షాపు

అల్లాదుర్గం(మెదక్): విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధమైన ఘటన అల్లాదుర్గం మండల పరిధిలోని చిల్వెర గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన నాగయ్య కుటుంబీకులు వలస వెళ్లగా , ఒక్కడే ఇంటి వద్ద ఉంటూ మేకలు మేపుతున్నాడు. రోజులాగే మేకలు మేపడానికి వెళ్లగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మంటలు చెలరేగి ఇల్లు దగ్ధమైంది. సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. ఈ ప్రమాదంతో రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు నాగయ్య వాపోయాడు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ మల్లయ్య ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

లాండ్రీ షాపు కాలి బూడిద..

హుస్నాబాద్: విద్యుదాఘాతంతో లాండ్రీ షాపు మంటల్లో కాలి బూడిదైన ఘటన హుస్నాబాద్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని పోస్టాఫీస్ సమీపంలో ఉప్పరపల్లి ఇస్తారి అనే రజకుడు ఉపాధి కోసం ఓ రేకుల డబ్బాలో లాండ్రీ షాపు నడిపిస్తున్నాడు. ఉచిత కరెంట్ కావడంతో కరెంట్ పెట్టెతో రోజు ఇస్త్రీ చేస్తాడు. ఇస్తారి గురువారం రాత్రి డబ్బాకు తాళం వేసి ఇంటికెళ్లగా 9 గంటల ప్రాంతంలో కరెంట్ షాక్‌తో డబ్బా మంటల్లో చిక్కుంది. దాదాపు 45 పట్టు చీరలు, 50 వరకు డ్రెస్సులు కాలి బూడిదయ్యాయి. స్థానికులు వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వగా మార్గమధ్యలో ఫైరింజన్ వాహనం నిలిచిపోయింది. అప్పటికే షాపు పూర్తిగా దగ్ధమైంది. సమయానికి ఫైరింజన్ వస్తే ప్రమాదాన్ని కొద్ది వరకు అరికట్టే వీలుండేదని స్థానికులు చెబుతున్నారు.

రాయపోలు.. చరిత్రకు ఆనవాళ్లు

- రాష్ట్ర కూటులు, చాళుక్య కాలానికి చెందిన శిల్పాలు
- పరిశోధనలో బయటపడ్డ అరుదైన విగ్రహాలు
- కళ్లకు కట్టినట్టుగా కనిపిస్తున్న చరిత్ర



చరిత్ర గురించి తెలిపే శిలా శాసనం



ప్రాచీన గణపతి దేవాలయం



సిడితల వీరగల్లు శిల్పం



జువ్విరెడ్డి కట్టించిన హన్‌మాన్ ఆలయం ఆనవాళ్లు

దుబ్బాకటౌన్: మనం కథలుగా చెప్పుకుంటున్న రాజుల చరిత్రకు ఆనవాళ్లు అక్కడక్కడా బయట పడుతున్నాయి. చాళుక్య రాష్ట్ర కూటుల కాలానికి చెందిన రాతి శిల్పాలు చెక్కు చెదరకుండా ఇప్పటికీ దర్శనమిస్తున్నాయి. నాటి కళాపోషణకు ఉన్న ఆదరణ ఎలాంటిదో చాలుక్య కళా రూపాలను తెలియజేసే కళా ఖండాలు రాయపోల్ మండల కేంద్రంలో వెలుగులోకి వచ్చాయి. ఇటీవల కొత్త తెలంగాణ చరిత్ర బృందం పరిశోధకుడు కొనిపాక శ్రీనివాస్ రాయపోల్‌లో పరిశోధనలు చేశారు. పరిశోధనలో చరిత్రను కళ్లకు కట్టినట్టుగా చూపించే శిల్పాలు బయటపడ్డాయి. ఆ శిల్పాల శాసనాల పై ఉన్న రాతలను బట్టి చాళుక్య కాలం నాటివిగా నిర్ధారించారు.


కళ్లకు కట్టినట్టుగా చరిత్ర

సిద్దిపేట జిల్లాలోని రాయపోల్ ప్రాంతంలో చాళుక్యులు తిరగాడిన ప్రదేశంగా చెబుతుంటారు. ఈ గ్రామంలోని గణపతి దేవాలయం దగ్గర కొన్ని వీరగల్లు విగ్రహాలు నేటికీ దర్శనమిస్తున్నాయి. వాటిలో చాళుక్య, రాష్ట్రకూటుల కాలానికి చెందిన శిల్పాలు ఉండటం విశేషం. వాటిలో ఒక ప్రత్యేకమైన వీరగల్లు శిల్పాన్ని కొత్త తెలంగాణ చరిత్ర బృందం పరిశోధకులు గుర్తించారు. ఈ శిల్పం ఆత్మాహుతి వీరగల్లుదని నిర్ధారించారు. ఇలాంటి శిల్పాన్ని సిడితల వీరగల్లుగా పరిగణిస్తున్నారు. రెండంతస్తులున్న ఈ వీరగల్లులోని మొదటి అంతస్తులో ఒక వీరుడు కూర్చుని ఉన్నాడు. ఆయన పట్టుకున్న పరికరమేదో స్పష్టంగా ఉంది. వీరుడి నడినెత్తిన కొప్పు ఉంది. వంచిన వెదురుగడకు తల తెగి స్పష్టంగా ఈ విగ్రహంలో కనిపిస్తుంది. అంజలి ఘటిస్తున్న వీరుడు ఆసనస్థితిలో కూర్చుని ఉన్నాడు. ఆత్మాహుతి చేసుకున్న వీరున్ని దేవలోకానికి తీసుకొనిపోతున్న ఇద్దరు చామరధారిణులైన అమరాంగనలు పై అంతస్తులో కనిపిస్తున్నారు. సిడితల వీరగల్లులు తెలంగాణ రాష్ట్ర ంలో కేవలం పది మాత్రమే ఉన్నాయని తెలంగాణ చరిత్ర బృందం సభ్యులు స్పష్టం చేస్తున్నారు. ఇదే విధంగా స్త్రీ సిడితల వీరగల్లులు చొల్లేరు, వనపర్తి గ్రామాల్లో నేటికీ దర్శనమిస్తున్నాయని చరిత్ర బృందం సభ్యులు చెబుతున్నారు. పురుష సిడితల వీరగల్లులు లింగంపల్లి, ఇప్పుడు రాయపోల్ లలో లభించాయి. శైవ భక్తులు ఆత్మబలిదానాలను ధర్మకార్యంగా, శివుని సన్నిధికి చేర్చే తక్షణ మార్గంగా ఎంచుకున్నారు.

సినిమాల్లో మాదిరిగానే..

అప్పట్లో వచ్చిన యుగానికి ఒక్కడు సినిమాలో కూడా ఇలాంటి శిల్పాన్ని పోలిన దృశ్యం ఒకటి కనిపించడం గమనార్హం. అందులో చోళులు తిరిగి చోళనాడుకు వెళ్లే సందర్భంలో ఎవరైనా బలిదానం చేయాలి అన్నపుడు ఒక వ్యక్తి తన తల వెంట్రుకలను వెదురుగడకు కట్టి కత్తితో ఇలానే నరుక్కొని బలిదానం చేసుకుంటారు. అలాగే వినాయక ఆలయం వద్ద ఉన్న శాసనంలో జువ్విరెడ్డి అనే వ్యక్తి హనుమాన్ దేయాలయం కట్టించినట్లు పేర్కొన్నారు. ఇలాంటి అరుదైన శిల్పాలు మన ప్రాంతంలో ఉండడం ఎంతో గర్వకారంగా ఉందని రాయపోల్ ప్రజలు సంబరపడుతున్నారు.

ఇంకా పరిశోధన చేయాలి



రాయపోల్ గతంలో ఒక చిన్న రాజ్యంగా ఉండేదని అక్కడ ఉండే శాసనం ద్వారా తెలుస్తుంది. అక్కడ గల చెరువు వద్ద 5 మట్టి దిబ్బలున్నాయి. వాటిని పూర్వికులు పాండవుల దిబ్బలుగా పిలిచేవారు. ఆ దిబ్బలు ఒకప్పటి రాయపోల్ కోట అవశేషాలు అయ్యుంటాయి. చెరువులో నీళ్లు తగ్గినప్పుడు దానిని పరిశీలిస్తే పలు నిజాలు తెలిసే అవకాశం ఉంది. ఇంకా రెండు శాసనాలు కూడా ఉన్నట్లు పురావస్తు శాఖ రికార్డులో ఉన్నాయి. కానీ ప్రస్తుతం అవి కనుమరుగయ్యాయి.

– కొలిపాక శ్రీనివాస్, కొత్త తెలంగాణ చరిత్ర పరిశోధకుడు